



పిఠాపురంలో స్పౌజ్ పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

జిల్లాలో 91.69 శాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం తొలి రోజే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 91.69 శాతం జరిగింది. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పంపిణీ సాగింది. జిల్లావ్యాప్తంగా 2,73,065 మంది పింఛన్‌దారులు ఉండగా 2,50,373 మందికి రూ.107కోట్ల 78 లక్షలు పంపిణీ చేశారు. జిల్లాలో కొత్తగా విడుదలైన పింఛన్లు పంపిణీలో కాకినాడ జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గొల్లప్రోలు అర్బన్‌లో 94.70 శాతం, తుని 93.95 శాతం, కాకినాడ అర్బన్ 93.63, పిఠాపురం రూరల్ 93.53, సామర్లకోట అర్బన్ 93.49, తాళ్లరేవు 92.81, పిఠాపురం అర్బన్ 92.75, తుని అర్బన్ 92.57, రౌతులపూడి 92.44, ఏలేశ్వరం అర్బన్ 92.40, పెద్దాపురం 92.38, గండేపల్లి 92.30, కాకినాడరూరల్ 92.06, పెద్దాపురం అర్బన్ 91.85, కొత్తపల్లి 91.85, కరప 91.67, కోటనందూరు 91.04, సామర్లకోట 90.98, తొండంగి 90.86, గొల్లప్రోలు రూరల్ 90.60, కాజులూరు 90.24, పెదపూడి 90.16, ప్రత్తిపాడు 89.88, ఏలేశ్వరం రూరల్ 89.30, జగ్గంపేట 89.26, కిర్లంపూడి 89.05, శంఖవరం 88.76 శాతం పంపిణీ చేశారు.



ఆహాకీ!

ఆహా.. అనేలా హాకీ జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 జట్లతో మార్చ్‌ఫాస్ట్, పరేడ్ ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. 12 రోజుల పాటు జరిగే పోటీల్లో ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. పోటీలు మొదలయ్యాయి..

అన్ని వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

పిఠాపురం అభివృద్ధిపైనే పవన్ నిరంతర ఆలోచన

ఎమ్మెల్సీ నాగబాబు

స్పౌజ్ పెన్షన్లు పంపిణీ

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను ఆయన వితంతువులకు అందజేశారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడున్నా నిరంతరం పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచిస్తూ ఉంటారని చెప్పారు. గత ప్రభుత్వం వితంతువులకు పింఛన్లు ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి పిఠాపురం నియోజకవర్గానికి కొత్తగా 750 పెన్షన్లు మంజూరు చేసిందన్నారు. జగ్గయ్యచెరువు కాలనీలో గతంలో పర్యటించినప్పుడు మహిళలు ఇక్కడ డ్రైనేజీ సమస్యను వివరించారని, వెంటనే రూ.50 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. మరో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనరు నామకనకారావు పాల్గొన్నారు.



వా..నై!

ముఖం చాటేసిన వరుణుడు

వానలకు రెడ్ సిగ్నల్

ఏటా జూన్ నుంచి నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పుంజుకుంటాయి. ఈ ఏడాది కూడా సకాలంలోనే నైరుతి రుతుపవనాలు రావ డంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. వర్షాలకు లోటుండదని భావించారు. అటు ఖరీఫ్ సీజన్ పనులు ఆరంభించేశారు. తీరా చూస్తే ఈ సీజన్‌లో రుతుపవనాలు దాదాపుగా ముఖం చాటేశాయి. కుండపోతగా కురవాల్సిన వానలు జాడలేకుండా పోయాయి. దీంతో వర్షా భావ పరిస్థితులు తలెత్తాయి.

- ఉమ్మడి జిల్లాను వెన్నాడుతున్న వర్షాభావం
- జూలైలో కరుణ చూపని వరుణుడు
- సగం నైరుతి ముగిసినా చినుకు జాడ లేదు
- 60 మండలాల్లోనూ తీవ్ర లోటు
- మరోపక్క భానుడి భగభగలు
- జూన్‌లో కాస్తోకూస్తో బెటర్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాను వర్షాభావం వెన్నాడుతోంది. నైరుతి రుతుపవనాలు ఊరించి ఊరించి ఉసూరు మనిపించాయి.జూన్‌లో కాస్త ప్రభావం చూపినా జూలైకు వచ్చే సరికి అసలు చినుకు జాడే లేదు.పైగా నైరుతి సీజన్ సగం ముగిసిపోవడంతో అన్ని మండలాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఒక్క కాకినాడ జిల్లాలో రెండు మండలాలు మినహా 19 మండలాలు లోటుతో ఉన్నాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం 41 మండలాలు లోటు వర్ష పాతంతో రెడ్‌మార్క్ జాబితాలో చేరాయి. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.గతేడాది ఇదే సీజన్‌లో వద్దంటే వర్షాలు ఉమ్మడి జిల్లాను ముంచెత్తాయి.ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలై అంతటా సూరీడు భగభగమంటూనే ఉన్నాడు. దీంతో జనం ఆపసోపాలతో అల్లాడారు.

లోటు వర్షపాతం..

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల సీజన్ అప్పుడే సగం ముగిసిపోయింది. కానీ వాన జాడలేక లోటు వర్షపాతం వెన్నాడుతోంది. మరోపక్క రుతుపవనాల కారణంగా రోజంతా కారు మబ్బులతో వాతావరణం చల్లగా మారి వానలు కురవాల్సి ఉంటే దీనికి భిన్నంగా ఉదయం ఏడు నుంచే సూరీడు దంచేస్తున్నాడు. అసలు సిసలు వేసవిని తలపిస్తూ సాయంత్రం వరకు తీవ్ర వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు సైతం 35 దాటిపోతోంది. అటు విద్యుత్ వినియోగం భారీగా తగ్గాల్సిన సమయంలోను తీవ్రంగా డిమాండ్ పెరిగిపోతోంది. గడచిన రెండు నెలల్లో వానలు కురవాల్సిన దానికంటే తక్కువగా కురిసిన నేపథ్యంలో ఇంకా ఆగస్టు, సెప్టెంబరు నెలలే రుతుపవనాల ప్రభావంతో వానలు భారీగా కురవడానికి అవకాశం ఉంది. అయితే మరి వరుణుడు ఏం చేస్తాడో చూడాలి.

కాకినాడ జిల్లా : జూన్‌లో రుతుపవనాల ప్రభావం అంతోఇంతో కనిపించింది. దీంతో కాకినాడ జిల్లా 21 మండలాల్లో సరాసరి 96.57 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 120.75 మి.మీ. నమోదైంది. జూలైకు వచ్చేసరికి 198 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 148 మి.మీ. మాత్రమే నమోదైంది. సరాసరిలో వ్యత్యాసం కొంతే ఉన్నా మండలాల వారీగా అధికంగా ఉంది. జూలైలో కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు, తొండంగి మండలాలు మినహా మిగిలిన 19 మండలాలు వర్షా భావంతో అల్లాడుతున్నాయి. ఇదే గతేడాది జూలై లెక్కలు తీసుకుంటే కాకినాడ జిల్లాలో 198 మి.మీ.వర్షపాతం నమోద వ్వాల్సి ఉంటే ఏకంగా 223 మి.మీ. నమోదైంది. గడచిన జూన్, జూలైలో 300 మి.మీ.కు 269 మి.మీ. వర్షపాతం నమోదవడంతో మైనస్ 10.27 మి.మీ. లోటు తేలింది.

కోనసీమ జిల్లా : జూన్ నెలలో సరాసరి 102 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 108 మి.మీ. కురిసింది. 22 మండలాలకు 11 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. 11 మండలాల్లో మాత్రమే అధికంగా కురిసింది. జూలైకు వచ్చేసరికి తీవ్ర వర్షాభావం వెన్నాడింది. జిల్లా సరాసరి 241 మి.మీ. వానకుగాను 150మి.మీ. నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే మాత్రం 22 మండలాలు తీవ్ర లోటులో చిక్కుకు న్నాయి. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా అంతా కలిపి 241 మి.మీ.వానకుగాను 339 మి.మీ. కురిసింది. అన్ని మండలాలు పుష్కలంగా వర్షంతో కళకళలాడాయి. ఈ జిల్లాలో జూన్,జూలై కలిపి మొత్తం 347.49 మి.మీ. సరాసరి వర్షపాతానికిగాను 258.37 మి.మీ. మాత్రమే నమోదై మైనస్ 25.65 మి.మీ. లోటుతో కొనసాగుతోంది.

తూర్పుగోదావరి జిల్లా : జూన్‌లో 107.77 మి.మీ.కు 145.27మి.మీ. వర్షం కురవడంతో బిక్కవోలు, కోరుకొండ మండలాలు మినహా మిగిలిన 17 మండలాలు అదనపు వర్షపాతం జాబితాలోకి చేరాయి. జూలైకు వచ్చేసరికి 247 మి.మీ. సరాసరి వర్షపాతానికి 169 మి.మీ. మాత్రమే కురిసింది.అదే మండలాల వారీగా చూస్తే మాత్రం మొత్తం 19 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్‌మార్క్‌లోకి వెళ్లిపోయాయి. అదే గతేడాది జూలైలో జిల్లావ్యాప్తంగా 247 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 374 మి.మీ కురిసి అదనపు వర్షపాతం జాబితాలోకి వెళ్లిపోయాయి.ఈ జూన్, జూలై నెలల్లో తూ.గో. జిల్లాలో సరాసరి 363.18 మి.మీ. వర్షపాతం నమోదవాల్సి ఉండగా 316.22 మి.మీ. నమోదైంది.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకట్రావు

జిల్లాలో మరో 183 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించాం : డీఆర్వో

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా మరో 183 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో శుక్రవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిస్టర్డ్, అన్‌రికగ్నైజ్డ్ పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గాల ఏఈఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల రీఆర్గనైజేషన్ ప్రక్రియ కింద కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల లోకేషన్లు, పేర్ల మార్పుల కోసం ప్రతిపాదనలను వివరించారు. ఎన్నికల కమిషన్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్‌కు గరిష్ఠంగా 1,150 మంది ఓటర్లు ఉండేలా పునర్ వ్యవస్థీకరిస్తూ కొత్తగా 183 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,640 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్త కేంద్రాల ఏర్పాటుతో ఈ సంఖ్య 1,823కు పెరిగిందన్నారు. ఓటర్ల సౌలభ్యత, భవన అనుకూలతలను పరిగణలోకి తీసుకుని 81 పోలింగ్ కేంద్రాల లోకేషన్ల మార్పు, 228 పోలింగ్ కేంద్రాలకు పేర్ల మార్పులను ప్రతిపాదించామన్నారు. నూతనంగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ల వివరాలను అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇచ్చామన్నారు. సూచనలు, సలహాలను వచ్చే సోమవారంలోపు ఈఆర్‌వోలకు తెలియజేయాలన్నారు. వాటిని క్రోడీకరించి తుది ప్రతిపాదనను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం పంపుతామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగన్నాథం పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్



కాకినాడలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో పింఛన్ల పంపిణీ 94శాతం జరిగిందని కమిషనరు భావన తెలిపారు. కొత్తగా మంజూరు చేసిన వితంతు పింఛన్లు 471 మందికి అందించామని ఆమె చెప్పారు. 49వ వార్డులో లబ్ధిదారులకు పింఛను సొమ్మును జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, కలెక్టర్ షాన్‌మోహన్ అందించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, టీపీ ఆర్వో శైలజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదాత.. సుఖీభవ!

- రైతులు 1,50,475 మంది
- రూ.101.97 కోట్లు జమ
- రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5వేలు
- కేంద్రం వాటా రూ.2 వేలు
- రూ.7 వేల చొప్పున జమ
- పండుగలా నిర్వహణ ఏర్పాట్లు

కాకినాడ రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి గ్రీన్ సిగ్నల్ పడింది. శనివారం నుంచి రైతుల ఖాతాల్లో సొమ్ములు జమకానున్నాయి. సూపర్ సిక్స్ హామీల్లో అన్నదాత సుఖీభవ పథకం ఒకటి..ఈ మేరకు రాష్ట్ర అమలు చేసేందుకు ముందుకొచ్చింది.ఈ మేరకు అన్నదాతలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీపికబురు అందింది. రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సహాయం చేయనున్నాయి.గత వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఏడాదికి కేవలం రూ. 13,500 మాత్రమే రైతు భరోసా కింద ఇచ్చేవారు. ఎన్నికల హామీలో భాగంగా తెలుగు దేశం కూటమి ప్రభుత్వం ఏకంగా 6,500 పెంచి ఒక్కో రైతుకు మొత్తం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇందులో రాష్ట్రం వాటా రూ.14 వేలు, కేంద్రం వాటా రూ.6 వేలు.కానీ అప్పటి మాదిరిగానే మూడు విడతలుగా సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలకు జమకానుంది. ఏప్రిల్ నుంచి జూలై వరకూ మొదటి విడత, ఆగస్టు నుంచి నవంబరు వరకూ రెండో విడత, డిసెంబర్ నుంచి మార్చి వరకూ మూడో విడతగా విభజించారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత రూ.5 వేలు, రెండో విడత రూ.5 వేలు,మూడో విడత రూ.4 వేలు జమ చేస్తుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడతకు రూ.2వేలు వంతున మూడు విడతల్లో ఆరు వేలు సరిపెడుతుంది. శనివారం జిల్లాలో ఒక్కో రైతుకు రూ.7 వేల వంతున జమకానుంది. ఈ సారి ప్రభుత్వం కౌలు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తుంది. ఒక్కో రైతుకు రూ.20 వేల వంతున ఇస్తుంది.ఈ విడతలో ఇంకా అర్హులైన కౌలు రైతుల లెక్కతేలక వచ్చే విడత నుంచి జమచేస్తారు..అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో జరిగే కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ పథకంపై సందేహాల నివృత్తికి 155251 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచారు.

కాకినాడ జిల్లాలో....

కాకినాడ జిల్లాలో 1,50,475 మంది రైతు కుటుంబాలకు లబ్ధిచేకూరనుంది. అన్నదాత సుఖీభవకు జిల్లాలో రూ.75.24 కోట్లు, పీఎం కిసాన్‌కు రూ.26.73 కోట్లు రెండింటికీ కలిపి మొత్తం రూ.101.97 కోట్లు రైతుల ఖాతాల్లో డీబీటీ ద్వారా జమకానున్నాయి. జిల్లాలోని 21 మండలాల్లో 1,50,475 మంది రైతు కుటుంబాలు లబ్ధి పొందనుండగా కాకినాడ రూరల్ నియోజకవర్గం రూరల్ మండలంలో 1,920 మంది, కరప మండలంలో 8,156 మంది మొత్తం 10,076 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. కాకినాడ అర్బన్‌లో 111 మంది, పిఠాపురం నియోజకవర్గం పిఠాపురం మండలంలో 9,818 మంది, గొల్లప్రోలులో 8,469, యూ.కొత్తపల్లి మండలంలో 4,818 మంది పిఠాపురం నియోజకవర్గంలో 23,105 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. తుని నియోజక వర్గం తుని మండలంలో 11,427 మంది తొం డంగి మండలంలో 8,422 మంది, కోటనందూరు మండలంలో 7,768 మంది మొత్తం 27,617 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ప్రత్తి పాడు మండలంలో 9,873 మంది, ఏలేశ్వరం 5,162, రౌతులపూడి 10,091, శంఖవరం 6,508 మంది మొత్తం 31,634 మందికి లబ్ధి చేకూ రనుంది. పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం మండలంలో 7,817 మంది, సామర్లకోట మండలం 7,104 మంది మొత్తం 14,921 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట మండలంలో 9,368, కిర్లంపూడి 6,630, గండేపల్లి 7117 మొత్తం 23,115 మంది, ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవు మండలంలో 4,036, అనపర్తి నియోజకవర్గం పరిధిలోని పెదపూడి మండలంలో 6,996 మంది, రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో 8,864 మంది రైతు కుటుంబాలు లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో మండల, గ్రామసచివాలయాలు, పంచాయతీల స్థాయిలో పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించనున్నారు.

సమస్యలుంటే.. తెలియజేయండి..

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు ఏమైనా సమస్యలుంటే సంబంధిత రైతుసేవాకేంద్రంలో సంప్రదించాలి. అంతే కాకుండా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించొచ్చు. సందేహాల నివృత్తికి 155251 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చు.

- విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

సైబర్ క్రైం మోసాలపై ఎస్పీ సమీక్ష

కాకినాడ క్రైం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం మోసాలపై అవగాహన కల్పించే దిశగా ఎస్పీ జి.బిందుమాధవ్ జిల్లావ్యాప్తంగా ఉన్న బ్యాంకుల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ప్రధానంగా బ్యాంకుల భద్రతా ప్రమాణాల పెంపు, సైబర్‌క్రైం మోసాలపై అవగాహన, తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకులు, సంబంధిత ఏటీఎంల్లో లోపల, వెలుపల నాణ్యతతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, వాటి పనితీరును నిత్యం పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థలు ఏర్పాటుచేయాలని, వాటి ఫుటేజ్ కనీసం 180 రోజులు భద్రపరిచే విధంగా ఉండాలన్నారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద రాత్రి సమయాల్లో సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినప్పుడు 112 నెంబరుకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. బ్యాంకుల్లో అలారం సిస్టం, ఐరన్ సేఫ్ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించి, అటువంటివి జరిగితే 1930కి కాల్ చేయాలని చెప్పాలన్నారు. ఖాతాధారులు తమ ఎస్‌బీ ఖాతా నుంచి ఇతర రాష్ట్రాల్లో ఉన్న కరెంట్ ఖాతాలకు పెద్దమొత్తంలో నగదును ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు వాటిపై నిఘా ఉంచి ఖాతాదారులను ఎలర్ట్ చేసి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



రెవెన్యూ వసూళ్లపై మాట్లాడుతున్న ఐజీ

పనితీరు బాగాలేదు!

జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులకు ఐజీ వీరపాండ్యన్ క్లాస్

వసూళ్లలో పూర్ అంటూ ప్రస్తావన

మ్యూటేషన్ విధానం పరిశీలన

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

'ఈఏడాది మీ రెవెన్యూ టార్గెట్ ఎంత?, ఎంత వసూలైంది? ఇంత తక్కువైతే చాలా కష్టం.. మళ్లీ వచ్చి చూస్తా.. రెవెన్యూ వసూళ్ల టార్గెట్ బాగోకపోతే ఊరుకునేది లేదు' ఇవీ శుక్రవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా ప్రత్యేక అధికారి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ జి.వీరపాండ్యన్ జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లతో అన్న మాటలు.. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ షాన్‌మోహన్, నగరపాలక సంస్థ కమిషనర్ భావనతో కలిసి ఆయన జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి విచ్చేశారు. కొత్తగా ప్రారంభించిన ఆటో మ్యూటేషన్ విధానాన్ని పరిశీలించారు. రెవెన్యూ వసూలు ఎంత?, ఎంత వసూలైంది?, ఎందుకంత తక్కువైంది? అంటూ ప్రశ్నలతో రిజిస్ట్రేషన్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. నూతనంగా ప్రారంభించిన ఆటోమ్యూటేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చూసి ఐజీ వీరపాండియన్ ఆశ్చర్యపోయారు. చిన్నచిన్న అక్షరాలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చూసి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లకు క్లాస్ తీసుకున్నారు.


జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (పైన), జ్యోతిప్రకాశనం చేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ (కింద)






మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఏపీ క్రీడాకారులు




హోరాహోరీగా తలపడుతున్న మిజోరాం, రాజస్థాన్ జట్ల క్రీడాకారులు

క్రీడా సంరంభం

కాకినాడలో అట్టహాసంగా ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథులుగా, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, హాకీ ట్రిపుల్ ఒలింపియన్ ఆశాంత్ర లాక్ర, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్య గీత, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.చాణుక్యరాజు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లా క్రీడా మైదానంలోని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హాకీ పోటీల ప్రారంభ సూచికగా కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ పతాకాన్ని, హాకీ ఇండియా పతాకాన్ని ఆశంత్రా లాక్ర, రాష్ట్ర పతాకాన్ని ఎమ్మెల్యే నానాజీ ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 హాకీ జట్లతో మార్చ్ ఫాస్ట్, పెరేడ్ ఘనంగా జరిగింది. ఆతిథ్యం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా జట్టు క్రీడాకారిణి లక్ష్మీప్రసన్న క్రీడా స్ఫూర్తితో టోర్నమెంటును విజయవంతం చేస్తామని అన్ని జట్ల క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు. 12రోజుల పాటు జరిగే పోటీల్లో


ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. టోర్నమెంటు నిర్వహణకు వివిధ అంశాలను స్పాన్సర్ చేస్తూ ఆర్థిక సహకారం అందించిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఏడు నెలల వ్యవధిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలకు కాకినాడ వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ ఉత్తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ హాకీ టోర్నమెంట్ సజావుగా జరిగేందుకు అవసరమైన భోజనం, వసతి ఇతర అన్ని ఏర్పాట్లు సమకూర్చామని, 12 రోజులు జరిగే క్రీడా పండుగను విజయవంతం చేయాలన్నారు. జాతీయ సాయిలో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ పోటీలకు సిద్ధమవుతున్న కాకినాడ నగర క్రీడాకారిణి ఆశ్రితకు కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవీంద్ర స్పాన్సర్ చేసిన రూ.2లక్షల చెక్‌ను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన 15వ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో భాగంగా తొలిరోజు...

ఎ-డివిజన్‌లో గోయన్స్ హాకీ, జమ్ముకశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గోయన్స్ జట్టు 2-1 స్కోరుతో, తెలంగాణ-గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 4-1 స్కోరుతో గుజరాత్, మిజోరాం-రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 12-0 స్కోరుతో మిజోరాం విజయం సాధించాయి.

బి-డివిజన్‌లో మణిపూర్-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో మణిపూర్, అసోం-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో అసోం, హిమాచల్‌ప్రదేశ్- అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-2 స్కోరుతో అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ-హాకీ అసోసియేషన్ ఆఫ్ బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-3 స్కోరుతో ఢిల్లీ విజయం సాధించాయి. మ్యాచ్‌లను టోర్నీ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు పర్యవేక్షించారు.



కింగ్స్ జట్టు ఫ్రాంచైజీలతో కెప్టెన్ భరత్

కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం
గర్వంగా ఉంది

ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు కేఎస్ భరత్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని, తన జీవితంలో ముఖ్యమైన వారంతా కాకినాడలోనే ఉన్నారని క్రికెటర్ కేఎస్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ కాకినాడలోనే చదువుకున్నారన్నారు. పుట్టింది కాకినాడలోనే అయినా విశాఖ తనను దత్తత తీసుకుందని తెలిపారు. అండర్- 13 విభాగంలో కాకినాడలో మ్యాచ్‌లు ఆడానంటూ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే కాకినాడ కింగ్స్ జట్టు సభ్యులు ఆర్ఎంసీ మైదానంలో సాధన చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో ఆంధ్రా క్రికెట్ సంఘం అభివృద్ధి చెందుతోందన్నారు. విలేకరుల సమావేశంలో కింగ్స్ జట్టు ఫ్రాంచైజీలు రామ్, అవినాష్, కార్యదర్శి సత్యనారాయణ, కోచ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము.. ఎలా వెళ్లేది!

- పేరుకే ఫాస్ట్ పాసింజర్ ప్రయాణం మాత్రం చాలా నెమ్మది
- అపరిశుభ్రంగా టాయిలెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు




నిడదవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈ రైలు కోసం ప్రతి రోజూ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తారు. అరగంట ఆలస్యమైంద ంటే ఒకటే టెన్షన్.. ఎక్కేవారు.. దిగేవారితో నిత్యం రద్దీగా నే ఉంటుంది.. అయినా ఆ రైలుపై ఎందుకో రైల్వే శాఖకు చిన్న చూపు.. సమస్యలు పట్టించుకోరు.. చెప్పినా వినిపించు కోరు.. చేసేది లేక అంత డిమాండ్ ఉన్న రైలులో నిత్యం ముక్కుతూ మూలుగుతూ ప్రయాణం చేస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటుంది. నిత్యం కాకినాడ పోర్టు నుంచి విజయవాడకు, తిరిగి సాయంత్రం విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలులో ఉద్యోగులు, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లేవారు ఎందరో రాకపోకలు సాగిస్తుంటారు. వేరే ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు అక్కడ పనిచేసే ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు భరించలేక, కుటుంబాలను, ఉన్న ఊరిని మార్చలేక ఇలా ఎన్నో కారణాలతో ఈ ఫాస్ట్ పాసింజర్ రైలులో ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేందుకే మక్కువ చూపుతున్నారు. కొవి డ్‌కు ముందు 16 బోగీలతో ఫాస్ట్ పాసింజర్‌గా రాకపోకలు సాగించే ఈ రైలు కొవిడ్ తరువాత 8 బోగీలతో ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తోంది. ఇలా రైలులో మూడే టాయ్‌లెట్స్ ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అవి కూడా అత్యంత దారుణంగా ఉంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే శాఖకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న ఫాస్ట్ పాసింజర్ రైలులో బోగీలను పెంచి చార్జీలను తగ్గించి పరిశుభ్రతకు ప్రాధాన్యతకు ఇవ్వాలని రైల్వే అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్.. ఈ ట్రైన్ పేరు విజయవాడ మేము. కానీ ఉభయ గోదావరి జిల్లాలో ఇది ఎంతోమందికి ఫాస్ట్ పాసింజర్ రైలుగానే తెలుసు. కొవిడ్‌కు ముందు ఫాస్ట్ పాసింజర్‌గా తిరిగిన రైలు కొవిడ్ తరువాత ఎక్స్‌ప్రెస్ పేరుతో తిరుగుతోంది. కానీ జర్నీ మాత్రం పాసింజరే. చార్జీలు ఎక్కువవయ్యాయి.. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు.





ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు



నిత్యం రైలులో నిడదవోలు నుంచి విజయవాడకు తిరిగి నిడదవోలుకు రాకపోకలు సాగిస్తుంటా. ఈ ఫాస్ట్ పాసింజర్ రైలుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు.రైలులో టాయ్‌లెట్లు ఏమాత్రం శుభ్రంగా ఉంచరు. రైల్వే అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం లేదు.

-వెంకటేశ్వరరావు, ప్రయాణికుడు.

ఒక బోగి కూడా పెంచరు



ఈ రైలు ప్రయాణీల్లో నేను ఒకడిని. కొవిడ్‌కు ముందు 16 బోగీలతో ఉండే రైలు ఆపై 8 బోగీలకు పరిమితమైంది. ఎప్పుడు రద్దీగా ఉండే రైలుకు కనీసం ఒక బోగి కూడా పెంచరు. ఎక్స్‌ప్రెస్ పేరుతో టికెట్‌కు అధిక ధరలు వసూలు చేస్తున్నా ప్రయాణం తప్పడం లేదు.

-సురేష్, ప్రయాణికుడు.



బాలాత్రిపుర సుందరికి సామూహిక
కుంకుమ పూజలు

కొవ్వూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న లలితపార్వతీ అమ్మవారికి అర్చకులు మానేపల్లి సుబ్రమ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

ఏటికొప్పాక బొమ్మలు కొనుగోలు చేసిన నాగబాబు

పిఠాపురం రైల్వే స్టేషన్‌లో వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ షాపు ప్రారంభం


ఏటికొప్పాక బొమ్మ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్‌లో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురం రైల్వే స్టేషన్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ స్టాల్‌ను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. ఏటికొప్పాక బొమ్మలను పరిశీలించిన ఆయన కొన్నిటిని కొనుగోలు చేశారు. అనంతరం పిఠాపురం పట్టణ శివారు ఏడు కాలువల వద్ద వ్యవసాయ శాఖ అందజేసిన డ్రోన్లను ప్రారంభించారు. కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు ఆనందనగర్‌లో జనసేన వీర మహిళ పిట్టా ముని ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో జనసేన నాయకుడు జ్యోతుల శ్రీనివాస్ సహకారంతో ఇంటిని నిర్మించారు. ఆ ఇంటి తాళాలను ఆమెకు నాగబాబు అందజేశారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు శిక్షణ

ఎటపాక, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 42 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. వీరికి భారత టేబుల్ టెన్నిస్ రిప్రజెంటేటర్ రియాజ్ శిక్షణ ఇవ్వనున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. వీరిలో 21 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారు. శిక్షణలో విద్యార్థులకు అన్ని రకాల మెలకువలతోపాటు ప్రతి రోజు హైజెనిక్ ఆహారం అందిస్తారు. 15 రోజుల శిక్షణ అనంతరం జాతీయ స్థాయి పోటీలకు అస్సాం వెళ్లనున్నారు. ఈ నెల 18,19,20 తేదీల్లో అక్కడ జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.


క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురికి ఉద్యోగాలు


జేఎన్టీయూకే వీసీతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. 40 మంది హాజరు కాగా బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ జిటా ద్వారా సీఎస్ఈ విద్యార్థులు పి.హర్షవర్ధన్, వీసీహెచ్ఎన్ఎస్‌వీఎల్ వైష్ణవి, సీహెచ్ ప్రీతి, జి.వెంకటశ్రీ సుమేధ ఎంపికయ్యారు. వీరికి రూ.18లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారన్నారు. ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందని, ప్రతినెలా రూ.60 వేలు స్టైఫండ్ అందజేస్తారు. ఉద్యోగార్థులను ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ అరవ కరుణ అభినందించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,71,925 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రాత్రి దేవదాయ శాఖ అదనపు కమిషనరు తెనాలి చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి వేద పండితుల ఆశీర్వచనం అందించగా ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పనులు పరిశీలించిన ఆర్డీవో.. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు నిర్మాణ పనులతోపాటు భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న రహదారులు, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు.

జలజీవన్‌తో గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షించాలి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గాలి నాణ్యత సూచికను లెక్కించే తరహాలోనే నీటి నాణ్యత సూచికను లెక్కించడానికి దేశంలో ఎలాంటి ప్రామాణిక వ్యవస్థ లేదని, గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నీటి నాణ్యతను పరీక్షించాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. నీటి నాణ్యతపై రియల్‌టైం మోనిటరింగ్, వాటర్ క్వాలిటీ ఇండెక్స్ ఏర్పాటుపై శుక్రవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్న లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పర్యవేక్షణ బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. అమృత్, అమృత్ 2.0 మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేకమైన డబ్ల్యూక్యూఐ లెక్కింపును కేంద్రం నిర్దేశించలేదని బదులిచ్చారు. నీటి నాణ్యతా ప్రమాణాల అమలుపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 3.92 లక్షల గ్రామాల్లో 2.48 లక్షల ప్రయోగశాల నమూనాలు సేకరించినట్టు వెల్లడించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో
జీఎస్ఎల్ వైద్య విద్యార్థికి చోటు


ఫణి అజయ్‌ను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విశేషమైన అధ్యయనం చేసి పీర్-రివ్యూడ్ జర్నల్‌కు పరిశోధన పత్రాన్ని సమర్పించిన రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన జీజీ ఫణిఅజయ్ పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు నమోదయ్యింది. 19 సంవత్సరాల కేటగిరిలో అతడికి ఈ గౌరవం దక్కింది. గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయుల్లో ఎఫ్ఈవీ-1 ప్లేట్‌లెట్ పారామీటర్లపై ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కవిత మార్గదర్శకత్వంలో అజయ్ ఈ పరిశోధన చేశారు. దీనిని వేలూరు సీఎంసీలో జరిగిన ఎండ్రోక్రినాలజీ అంతర్జాతీయ కాంగ్రెస్‌లో సమర్పించగా సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురితమైంది. గ్రామీణ టెక్స్‌టైల్ కార్మికులు, పాఠశాల ఉపాధ్యాయుల బయోకెమికల్ పారామీటర్లపై అజయ్ చేసిన పరిశోధనకు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ యూబీ విజయలక్ష్మి మార్గదర్శకత్వం వహించారు. దీనిని కాకినాడలో జరిగిన సైంటిఫిక్ కాన్ఫరెన్స్‌లో సమర్పించి ప్రచురించారు. ఈ సందర్భంగా అజయ్‌ను జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్కే మిశ్రా తదితరులు అభినందించారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- సేవాదళ్ ద్వారా వచ్చే సేవకులను వినియోగించుకోవాలి
- ఖర్చు చేసే ప్రతిరూపాయి సౌకర్యాల కల్పనకు ఉపయోగపడాలి
- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్
- అన్నవరం దేవస్థానంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సేవలందించేందుకు విచ్చేసే సేవాదళ్ సభ్యుల సేవలను వినియోగించుకుని వారి ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఆగమ పాఠశాల, ఇతర నిర్మాణాలను పరిశీలించి కమాండ్ కంట్రోల్‌రూం నందు అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది జీతాల కోసం పనిచేస్తుండగా సేవాదళ్ సభ్యులు అవేమి ఆశించకుండా సేవలందిస్తున్నారని వారికి సౌకర్యాల కల్పన విషయంలో రాజీపడవద్దని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఖర్చు చేసే ప్రతిరూపాయి భక్తుల సౌకర్యాల కల్పనకు ఉపయోగపడేవిధంగా ఖర్చుపెట్టాలన్నారు. ఆగమ పాఠశాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విద్యార్థులు తమ ఆహార పదార్థాలు స్వీకరించిన ప్లేట్‌లు, గ్లాసులు వేడినీటితో శుభ్రంచేసేందుకు వీలుగా గ్రీజర్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అదనంగా మరో మనిషిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న మెయిన్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు ఎవరూ రానందున దానిని డార్మెటరీగా వినియోగించుకోవాలని సూచించారు. సీఆర్వో కార్యాలయం వద్ద నూతనంగా భక్తులకు అవసమైన తినుబండారాలు విక్రయించుకునేందుకు క్యాంటీన్ ఏర్పాటుచేయాలన్నారు. సిబ్బంది అంతా ఎస్‌ఓపీ నిబంధనలు పాటించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రలైజ్డ్ శానిటేషన్ కాంట్రాక్ట్ ఈనెల 15 కల్లా ఫైనల్ అవుతుందని ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పీఎఫ్ సొమ్ముల విషయమై కమిషనర్‌ను కలవగా కార్మికులు ప్రతినెలా తమ సొమ్ములు జమ అవుతున్నాయా లేదా అనేది చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా లక్ష లీటర్ల నీటిని నిల్వచేసేందుకు ఏర్పాటుచేసిన అల్యూమినియం ట్యాంక్‌ను పరిశీలించారు. సమీక్షలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ఆర్జేసీ త్రినాధరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజు పాల్గొన్నారు. అంతకముందు సత్యదేవుడిని దర్శించుకున్న ఆయనకు ఆలయ ఈవో, చైర్మన్‌లు ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ఆసుపత్రి నుంచి ఆగమ పాఠశాల విద్యార్థుల డిశ్చార్జి



అన్నవరంలో వేద విద్యార్థులతో మాట్లాడుతున్న దేవదాయ కమిషనర్

తునిరూరల్/అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతతో కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో చేరిన అన్నవరం దేవస్థానం స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు 11 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఆగమ పాఠశాలకు మధ్యాహ్నం సురక్షితంగా చేరుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను మంత్రి ఫోన్ ద్వారా ఆలయ అధికారులను అడిగినట్టు తెలుస్తోంది. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి కావల్సిన సౌకర్యాలను తక్షణమే అందించాలని అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు విభాగ అధికారులకు సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్రహోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

వ్యక్తి మృతి కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

మండపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద కేసులో తల్లీకూతుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు పంచాయతీ పరిధిలో ఎర్రదిబ్బకాలనీకి చెందిన వాకాడ వీర్రాజు (45) ఇంటిలో భార్య, కూమార్తెతో గొడవపడి మరుసటిరోజు అనుమానాస్పదంగా మృతిచెందాడు. వీర్రాజు గుండెపోటుతో మరణించాడని అతడి భార్య, కూమార్తె అందరినీ నమ్మించారు. గత నెల 17న జరిగిన ఈ సంఘటనపై వీర్రాజు కుమారుడు మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తన తల్లి, చెల్లి కలిసి తండ్రిని హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని చెప్పడంతో గత నెల 21న పోలీసు, రెవెన్యు అధికారులు వీర్రాజు మృతదేహన్ని వెలికితీసి పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం దర్యాప్తులో వీర్రాజు భార్య సత్యవేణి, కుమార్తె లావణ్యను అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు మున్సిపల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల పాటు రిమాండ్ విధించారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

అల్లవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కేసు నమోదు కావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శుక్రవారం విచారణ చేపట్టారు. బాలికపై అయినవిల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన నవుండ్రు రాకేష్ అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు అల్లవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిలో దర్యాప్తు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



నాగరాజు (ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం పంచాయతీ బొర్రాయిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త దోనిపాటి నాగరాజు (30) గురువారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బైక్‌పై వెళ్తున్న నాగరాజును స్కూల్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు మృతుడి తండ్రి గణపతి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం నాగరాజు మృతదేహన్ని బొర్రాయిపాలెం తీసుకువస్తున్నట్టు సర్పంచ్ నల్లా బాబండి తెలిపారు.

నకిలీ టీపొడి విక్రయంపై కేసు

రావులపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తమ కంపెనీకి చెందిన పేరుతో నకిలీ టీపొడి విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టాటా చక్రగోల్డ్ లేబుల్‌తో ఉన్న నకిలీ టీపొడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం షిరిడి సాయి మణికంఠ దుకాణంలో విక్రయిస్తున్నారంటూ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తి అరెస్ట్

దేవీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళను గాయపరిచిన వ్యక్తిపై శుక్రవారం దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం పరగసానిపాడు ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మహిళను పెద్దభీంపల్లి గ్రామానికి చెందిన నేలపాటి రాజేష్ కర్రతో గాయపరిచాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

తప్పిన పెను ప్రమాదం

బోల్తా కొట్టిన నాఫ్తా ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి తీసిన ఓఎన్జీసీ సిబ్బంది



బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను పైకి లేపుతున్న ఓఎన్జీసీ, ఫైర్ సిబ్బంది

ముమ్మిడివరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం దొమ్మేటిపారివాలెం వద్ద పెను ప్రమాదం తప్పింది. నాఫ్తాను తీసుకెళ్తూ బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను శుక్రవారం ఉదయం భారీ క్రేన్ సహాయంతో పైకి లేపడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాటిపాక ఓఎన్జీసీ సైట్ నుంచి సుమారు 29వేల లీటర్ల నాఫ్తా చెన్నైకు తీసుకెళ్తుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులోని దొమ్మేటిపారివాలెం వద్ద గురువారం అర్థరాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టింది. వెంటనే ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడ ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను సిద్ధం చేశారు. ట్రాఫిక్‌ను ముమ్మిడివరం మీదుగా మళ్లించి ఘటనా స్థలానికి వంద మీటర్ల మేర ప్రజల్ని ఖాళీ చేయించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా 2 అంబులెన్సులు ముమ్మిడివరం, అమలాపురం ఫైర్ ఇంజన్లతో పాటు ఓఎన్జీసీకి చెందిన మరో 2 ఫైర్ ఇంజన్లు, 4 క్రేన్‌లను సిద్ధం చేశారు. ఓఎన్జీసీ సెక్యూరిటీ ఆఫీసర్ బలరామ్ సిబ్బందితో చేరుకుని ట్యాంకర్ క్యాప్ నుంచి లీకవుతున్న నాఫ్తాను అదుపుచేసి ట్యాంకర్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. చిన్న క్రేన్లతో సాధ్యంకాకపోవడంతో భారీ క్రేన్‌ను తీసుకువచ్చి ఫోమ్ పిచికారీ చేస్తూ 3 గంటల పాటు శ్రమించి ఉదయం 7.30 గంటల సమయంలో పైకి లేపారు. ట్యాంకర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ట్యాంకర్‌లో ఉన్న నాఫ్తా సుమారు 2వేల లీటర్లు నేల పాలు అయింది. నాఫ్తా గాలిలో కలిసి వెంటనే ఫైర్ అయ్యే స్వభావం ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించి అటుగా వాహనాల రాకపోకలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేయించారు. ఫైర్, ఓఎన్జీసీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేసి ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి లేపారు. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బోల్తా కొట్టిన ట్యాంకర్‌కు మరమ్మతులు చేసి అక్కడినుంచి తరలించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తాళ్లరేవు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన 12 ఏళ్ల బాలుడిని శుక్రవారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న శ్రీరామ్ (12) తప్పిపోవడంతో అతడి నానమ్మ మందపల్లి వీరమ్మ కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసుల బృందం తక్షణం స్పందించి 6గంటల సమయంలో బాలుడి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో 'శ్యామ్' విద్యార్థుల ప్రతిభ

కార్పొరేషన్/కాకినాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్స్ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. శుక్రవారం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించిన చైర్మన్ జి.శ్యామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు 67శాతం విజయంతో ప్రభంజనం సృష్టించారన్నారు. సివిల్ కానిస్టేబుల్స్ విభాగంలో జి.నానాజీ(విశాఖ), మహిళా విభాగంలో రమ్యమాధురి(విజయనగరం), అలాగే ఏపీఎస్పీ విభాగంలో ఎం.అచ్యుతరావు(విశాఖ) స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం ఇనిస్టిట్యూట్‌కే గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కలిపి 6014 ఉద్యోగాలకు ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 4005కు పైగా ఉద్యోగాలను తమ ఇనిస్టిట్యూట్ ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోచింగ్ టెస్ట్ సిరీస్, మెటీరియల్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు.

మంచి విజయం సాధించా



నా పేరు మేరుగ అచ్యుతరావు. నాది అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 144.5 మార్కులతో ఏపీఎస్పీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. మా నాన్న సముద్రంలో చేపల వేటకు వెళ్తాడు. అమ్మ కూలీ పనికి వెళ్లి రోజుకు రూ.400 సంపాదించి ఇంటిని చూసుకుంటుంది. చోడవరం ఆఫ్‌లైన్ సెంటర్‌లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సండే మోడల్ టెస్‌లు రాస్తూ, గ్రౌండ్ స్కోర్ ఎక్కువతో మంచి విజయాన్ని సాధించాను.

విజయం అంకితం



నా పేరు గొర్లి రమ్యమాధురి. మాది విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 159 మార్కులతో మహిళల విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. అమ్మే చదివించింది. నా విజయంలో అమ్మ, అన్నయ్యలతో పాటు స్నేహితులు పాలు పంచుకున్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌లైన్ మోడల్ టెస్ట్ సిరీస్ విజయనగరం సెంటర్‌లో రాసేదాన్ని.

ఆ ముగ్గురే కారణం



నా పేరు గండి నానాజీ. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 168 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. నాన్న మేకలకాపరి. అమ్మ వ్యవసాయ కూలీ. అన్నయ్య ఎలక్ట్రికల్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అమ్మ, నాన్న, అన్నయ్య కష్టమే ఈ రోజు నేను స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడానికి ముఖ్య కారణం.

జలకళ

నిండిన సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు



నిండుగా ఉన్న డొంకరాయి జలాశయం

మోతుగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జలాశయాలకు సుమారు 14 టీఎంసీల నీరు చేరిందని జెన్‌కో అధికారులు లెక్కగడుతున్నారు. బలిమెల జలాశయానికి సుమారు 11టీఎంసీలు చేరినట్టు తెలిపారు. ఏపీపీ డ్యాం, డొంకరాయి జలాశయానికి సుమారు 7వేల క్యూసెక్కుల చేరుతుండటంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. సీలేరుకు 1500క్యూసెక్కులు, బలిమెల జలాశయానికి సుమారు 9500 క్యూసెక్కులు వస్తున్నాయి. జోలాపుట్, బలిమెలలో ప్రస్తుతం ఉన్న 45.90 టీఎంసీల్లో 25.39టీఎంసీలు ఆంధ్రా వాటాగా ఉంది. డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న 9.71టీఎంసీలతో కలిపి మన రాష్ట్రం వాటాగా 35.10 టీఎంసీల నిల్వలు ఉన్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. లోడ్ డిస్పాచ్ సెంటర్ ఆదేశాల మేరకు సీలేరు కాంప్లెక్స్‌లోని అన్ని విద్యుత్తు కేంద్రాల్లో నిరాటంకంగా ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 9.36 మిలియన్ యూనిట్ల విద్యుత్పత్తి జరుగుతోంది.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీలకు రూ.90వేలు విరాళం



కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందిస్తున్న నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణకు కాకినాడ నారాయణ విద్యాసంస్థలు రూ.90వేలు విరాళం ఇచ్చాయి. ఈ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు విరాళం చెక్కును డీజీఎం ఎస్‌వీ కృష్ణ, ఏజీఎం కె.రాఘవేంద్రరావు శుక్రవారం అందజేశారు. డీఐఈవో శారద, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అతి పెద్ద రాజకీయ కుట్ర : రత్నాకర్

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ దేశ చరిత్రలో అతి పెద్ద రాజకీయ కుట్ర అని మల మహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1,108 ఎస్సీ కులాలకు ప్రధాని మోదీ ఎలా పంచుతారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 59 ఎస్సీ కులాలకు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎలా ప్రయోజనం చేకూర్చగలరన్నారు. మాల సామాజికవర్గీయులంతా శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని కోరారు.

అయస్కాంతం ముక్క మింగిన బాలిక

తొలగించిన వైద్యులు



వైద్యులు తొలగించిన ముక్క

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురద కోట గిరిజన తండాకు చెందిన మాడెం రమ్య 1వ తరగతి విద్యార్థిని రింగ్ ప్యాకెట్‌లో ఉన్న అయస్కాంతం ముక్కను మింగేసింది. దీంతో బాలికను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ముక్కను వైద్యులు తొలగించారు. బురదకోట సమీపంలోని బాపన్నధారకు చెందిన మాడెం రమ్య బురదకోటలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతుంది. అయితే రింగ్ ప్యాకెట్లు తినే అలవాటు ఉన్న బాలిక ఆ ప్యాకెట్‌లో తిను పదార్థాలతో పాటు అయస్కాంతం ముక్కను కూడా మింగేసింది. దీంతో బాలికను ప్రత్తిపాడు, ఏలేశ్వరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించినప్పటికీ అయస్కాంతం తొలగించే సదుపాయాలు లేవని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం వైద్యులు అయస్కాంతం ముక్కను తొలగించారు. ఈ అంశంపై సంబంధిత రింగ్ కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని బాలిక తల్లిదండ్రులు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

పింఛన్ల సొమ్ము దుర్వినియోగం

ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.14లక్షలు దుర్వినియోగం చేశారు. మూడేళ్లుగా లబ్ధిదారులకు చెల్లించకుండా మిగిలిన సొమ్మును ఖజానాకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించారు. దీంతో ఈ వ్యవహారంపై ప్రత్తిపాడు ఎంపీడీవో ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో పింఛన్ల నిమిత్తం 11,539 మందికి రూ.5,05,47500 నెలవారీ ఖర్చు చేస్తున్నారు. అయితే ప్రతి నెలా పలు కారణాల వల్ల కొంత సొమ్ము సచివాలయ సిబ్బంది వద్ద నిలిచిపోతుంది. 2021 నుంచి 2024 మధ్యలో ఈ విధంగా రూ.30లక్షల వరకు మిగిలిన సొమ్ములు సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండిపోయాయి. వీటిని వెనువెంటనే స్థానిక ఖజానా కార్యాలయంలో జమ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా సచివాలయ ఉద్యోగులు సొంత అవసరాలకు వాడుకోవడం విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో రూ.16లక్షల వరకు గతంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు రికవరీ చేసి ఖజానాకు జమ చేయించారు. అయితే ఇంకా రూ.14 లక్షల వరకు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉండిపోవడంతో ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. వీటిలో గోకవరం పంచాయతీకి చెందిన రూ.2,03,250, చినశంకర్లపూడికి చెందిన రూ.7,46,250, గజ్జెనపూడికి చెందిన రూ.45వేలు, ధర్మవరానికి చెందిన రూ.1,90,250, ఒమ్మంగి పంచాయతీకి చెందిన రూ.3.75లక్షలు పింఛన్ల పంపిణీ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సి ఉంది. దీంతో నిధులు దుర్వినియోగం చేసినట్టు భావించి ఐదుగురు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులను ఎంపీడీవో జారీ చేశారు. 24 గంటలలోపు రూ.14లక్షలు ఖజానాకు జమ చేసి రసీదును ఎంపీడీవో ఆఫీసులో అందజేయాలనిఆదేశించారు.



రాయి.. చూసుకువెళ్లవోయ్!

కాకినాడ రామారావు పేట ప్రకాశం వీధిలో రోడ్డు మధ్య భాగాన గుంత పడింది. దీంతో వానదారులు ప్రమాదాలకు గురవుతారని స్థానికులు పెద్ద రాయిని ఏర్పాటు చేశారు. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

రేపు ఆరుద్ర శత జయంతి సభ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పది గంటలకు ప్రముఖ సాహితీవేత్త ఆరుద్ర శత జయంతి సభ నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగే సభలో 'ఆరుద్ర జీవితం-సాహిత్యం' అంశంపై డాక్టర్ ఎంవీ భరతలక్ష్మి, డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు ప్రసంగిస్తారు.





కాకినాడ రూరల్‌లో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, కాకినాడలో లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

'పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జగన్నాథపురంలోని గౌరీశంకరపేట, నేతాజీ పార్కుల్లో కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనరు కోన శ్రీనివాసరావు, టీపీఆర్వో శైలజ, టీడీపీ డివిజన్ నాయకులు గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, మల్లాడి చిన్న, పాలిక నాని, పీర్ల లక్ష్మీప్రసన్న, మేడిశెట్టి చిన్ని, కొనాడ ప్రకాశరావు, సంగాని నాగూర్, సాకా వెంకట్, రాళ్లపూడి ప్రకాష్, అయినవిల్లి పద్మ, డబ్బీరు జగదాంబ, మండపాక దుర్గాప్రసాద్, గబ్బర్, చింతా సతీష్ తదితరులు పాల్గొన్నారు. 36వ డివిజన్ సచివాలయంలో ఐదుగురు లబ్ధిదారులకు స్పౌజ్ పింఛన్లను టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది అందజేశారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం పండూరులో కొత్తగా మంజూరైన స్పౌజ్, సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంతం నానాజీ అందజేశారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురంలో స్పౌజ్ పింఛన్లను లబ్దిదారులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. టీడీపీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ల రామకృష్ణ, గోలి వెంకట అప్పారావు చౌదరి, ఎంపీడీవో కరక హిమమహేశ్వరి, ఏపీఎం జగదీశ్వరి, తలారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని పులిమేరులో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల నాని పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): విరవ, మంగితుర్తి గ్రామాల్లో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, నాయకులు బర్ల అప్పారావు, సూర్నీడి వరప్రసాద్, ఉలిశెట్టి ఆనంద్, పాలపర్తి అబ్బులు, వినుకొండ అప్పారావు, నడిగట్ల సత్యనారాయణ, గారపాటి అబ్బు, కుంచే వెంకట్రావు, కసిరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): 19, 20 వార్డుల్లో స్పౌజ్ పింఛన్లను నగర పంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు అందజేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో స్పౌజ్ పింఛన్లను జడ్పీ సీఈవో లక్ష్మణరావు అందజేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులను పరిశీలించారు. పారిశుధ్యం, ఐవీఆర్ఎస్ కాన్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలో వివిధ గ్రామాల్లో స్పౌజ్ పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



పెద్దాపురంలో పింఛను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)



కొత్తపల్లిలో పింఛను అందజేస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మణరావు





పిఠాపురం మండలంలో పెన్షన్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప



సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ ఆవరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పండ్లు, పుష్పాలతో రాజరాజేశ్వరీదేవికి అలంకారం



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గాజులు, పుష్పాలంకరణలో అపర్ణాదేవి

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పాదగయ భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రావణ శుక్రవారం నోము ఆచరించారు. అమ్మవార్ల ఫొటోలు ఉంచి పూజలు జరిపారు. రాజరాజేశ్వరీదేవిని పండ్లు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తిపీఠం అధిష్టాన దేవత పురుహూతికా అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మాధురి విద్యాలయలో సామూహిక సరస్వతి పూజలు జరిగాయి. పదో తరగతి విద్యార్థులు తమ పుస్తకాలు ఉంచి అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మాధురి విద్యా సంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు-సీతాదేవి దంపతులు, ఇన్‌చార్జి ఈశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవికి శ్రావణ శుక్రవారం సందర్భంగా సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని గాజులు, పుష్పాలతో ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి అలంకరించి పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమారరామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి అమ్మవారి మందిరం ఎదుట మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో వ్రతాలు జరిగాయి. తొలుత అమ్మవారి చిత్రపటం ముందు ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), ఈవో నీలకంఠం దీపారాధన చేసి పూజలను ప్రారంభించారు. దాతల సౌజన్యంతో 800 మంది మహిళలకు అమ్మవారి చిత్రపటాలు, తోరాలు, గాజులు, అరటిపళ్లు, పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు అందజేశారు. నిత్యాన్నదానంలో 1,500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



గొల్లప్రోలు మాధురి విద్యాలయలో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థినులు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి, రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు

'తల్లి పాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాల ద్వారానే శిశువుకి పోషకాలు అందుతాయని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి పేర్కొన్నారు. ఐసీడీఎస్ నిర్వహిస్తున్న శిశుగృహ నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సుషేణ హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్ మిల్క్ బ్యాంక్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంబంధిత పోస్టర్‌ను ఐసీడీఎస్ పీడీ లక్ష్మి, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఐసీడీఎస్ చైల్డ్ ప్రొటెక్షన్ వెంకట్, మిల్క్ బ్యాంక్ మేనేజరు శివమాధవ్, సీడీపీవోలు జ్యోతి, దుర్గ, వక్కలంక రమణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో సుషేణ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి పోస్టర్‌ను ఆవిష్కరించారు. తల్లి పాల విశిష్టతపై తల్లులకు అవగాహన కల్పించారు. అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మోహర్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా, ఐసీడీఎస్ పీడీ చెరుకూరి లక్ష్మి, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, రెడ్‌క్రాస్ సెక్రటరీ శివకుమార్, ఐసీడీఎస్ సీడీపీవోలు జ్యోతి, మాధవి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ లావణ్యకుమారి



ఎమ్మెల్సీ నాగబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే దొరబాబు

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన దొరబాబు

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబును మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు శుక్రవారం కలిశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జీ, నాయకులు తుమ్మల బాబు, బాలిపల్లి రాంబాబు, కీర్తి వెంకటరమణ, కర్రి దుర్గాప్రసాద్, కొత్తపల్లి బుజ్జి ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాలి

పెద్దాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను, కాస్మోటిక్ చార్జీలను తక్షణం చెల్లించాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6వేల కోట్లు ఉన్నాయన్నారు. యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తుండడంతో ఫీజు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందిపడుతున్నారన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దుమ్ములపేటలోని తమ చర్చిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని విక్టరీ రివైవల్ సెంటర్ అధినేత పాస్టర్ మోసా అబ్రహం తెలిపారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల నేతృత్వాన అత్యాధునిక వైద్య పరికరాలతో కంటి పరీక్షలు జరుపుతామని ఆయన చెప్పారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కరప, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రిపూడిలో గండి అప్పలరాజు తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కాలి బూడిదైంది. డయాలసిస్ పేషెంట్ అయిన అతడి కుటుంబం సర్వస్వం కోల్పోయి రోడ్డునపడింది. స్పందించిన కూటమి నాయకులు శుక్రవారం ఆ కుటుంబానికి రూ.74వేల నగదు, 1.5 క్వింటాళ్ల బియ్యం, దుస్తులు అందజేశారు. కూటమి నాయకుల స్ఫూర్తితో మరికొంత మంది విరాళాలు సేకరిస్తున్నారని, బాధితులకు రూ.లక్ష వరకు సాయం అందనుందని జనసేన కరప మండల కార్యదర్శి అనుకుల రాంబాబు తెలిపారు. కూటమి నాయకులు గండి వెంకటేశ్వరరావు, జోకా అప్పలరాజు, పుణ్యమంతుల అన్నవరం, ఓలేటి సూర్యనారాయణ, జల్దాని ఏసుగంగాధర్, యనమదల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్నకూటమి నాయకులు

రాజ్యసభ సభ్యుడు సతీష్ ప్రజా దర్బార్‌కు 38 అర్జీలు

సామర్లకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 16వ ప్రజా దర్బార్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 38 అర్జీలు నమోదయ్యాయి. కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో కూడిన బృందం వినతులు స్వీకరించింది. పది అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించగా మిగిలిన వాటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల ఉన్నతాధికారులకు పంపించారు. టీడీపీ నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్‌న్యూటన్, చింతపల్లి అర్జున్, నెక్కంటి శ్రీనివాసు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, జున్నూరు బాబీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో వినతులు ఇచ్చేందుకు వచ్చిన మహిళలు



ప్రమాణస్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులు

అయ్యప్పస్వామి ఆలయ నూతన కమిటీ

తాళ్లరేవు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకరపాలెంలో పునర్నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నూతన కమిటీ శుక్రవారం కొలువుతీరింది. చైర్మన్‌గా మాజీ సర్పంచ్ మోపూరి శ్రీనివాసకిరణ్, సభ్యులుగా పది మంది ప్రమాణం చేశారు. వారితో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి ఆలయ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సుంకరపాలెం, కనకాలపేట ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను తక్షణం రద్దు చేయాలి'

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీవీ రావు మాలమహానాడు, ఏఐఎఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రథాలపేట సెంటరు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఆందోళనలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగు నూకరాజు, నాయకులు బత్తిన శామ్యూల్, బత్తుల రాంజీకుమార్, సాకా బాబూరావు, రామకృష్ణ, పెదపాటి రాజేష్, దుర్గాడ విజయలక్ష్మి, చెల్లి నూకరాజు, యాళ్ల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని వాకతిప్పలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీ రావు మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల రాంజీకుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు సాంబశివకుమార్, దాకే రాజకుమార్, దాసరి శేఖర్, రమణ, రవి, నూతన్, ఈరుగుల శ్రీనివాసరావు, బత్తుల నవీన్, పీవీ రావు మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

'పిఠాపురాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతాం'

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) ప్రణాళికబద్ధంగా మొక్కలు నాటడం ద్వారా పిఠాపురం పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామని విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా పేర్కొన్నారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండో విడత మేక్ గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యచెరువు కాలనీలో రహదారికి ఇరువైపులా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మతో కలిసి ఆయన శుక్రవారం మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, అచ్చంపేట సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యచెరువులో కాలనీలో మొక్క నాటుతున్న డాక్టర్ ఉమర్‌ఆలీషా

'భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని ఏపీ బిల్డింగ్, కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. కొండయ్యపాలెం శారదాదేవి గుడి వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభకు యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు పోస్టుకార్డుల ద్వారా విన్నవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీను, రాము సురేంద్ర, సత్యనారాయణ, భాను, ప్రకాష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న తోకల ప్రసాద్



రైతులకు డ్రోన్ పంపిణీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు రైతులకు డ్రోన్‌ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి గ్రామసభ ద్వారా తీర్మానం చేసి రూ.2లక్షలు పెట్టుబడి పెడితే మిగతా మ్యాచింగ్ గ్రాంటును బ్యాంకు ద్వారా మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్, ఎంపీపీ ఎన్.అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, కూటమి నాయకులు శిరంగ శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, మాదారపు తాతాజీ, నందిపాటి రమణ, బావిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పెద్దాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర, రక్తదాన శిబిరాలను వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి, రోటరీ క్లబ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో త్సలికి సత్యభాస్కరరావు, వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

6న జాబ్‌మేళా

రౌతులపూడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద దిబ్బలపాలెం ప్రభుత్వ పాఠశాల దగ్గర ఉదయం పది గంటల నుంచి జాబ్ మేళా జరగనుంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మం డలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ కోరారు. అభ్యర్థులు పోర్టల్‌లో నమో దు చేసుకుని హాజరుకావాలన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏజెన్సీలో పింఛన్ల పండుగ


పింఛను అందిస్తున్న నేతలు

రంపచోడవరం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని సంత మార్కెట్, చినగొట్టాల రేవులో కూటమి నాయకులు శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల బాపిరాజు, పాటోజు సురేష్, దిడ్డి జనార్ధన్, మంగ రౌతు వీరబాబు, కారు లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.


మోతుగూడెంలో...

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పరిధిలో నూతనంగా లబ్దిదారులకు మంజూరైన స్పౌజ్ పెన్షన్లను చింతూరు ఎంపీడీవో శ్రీనివాస దొర, మోతుగూడెం సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి జీ. మోహన్ అందజేశారు. పెన్షన్లను మోతుగూడెం పీసా కమిటీ సభ్యుడు మడివి ఓలయ్య టీడీపీ సీనియర్ నాయకులు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●వై. రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పంచాయతీ కార్యదర్శి నాదెండ్ల రఘుబాబు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టారు. దీనికి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఎంపీటీసీ రమణ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, కిముడు మూర్తి, మత్సుర్తి నాగేంద్ర ప్రసాద్, సచివాలయ సిబ్బంది జీ. రామ్మూర్తి, ఎస్. సింధూర, పి. సుబ్రహ్మణ్యం, పీల్డ్ అసిస్టెంట్ వీ. దామోదర్ పాల్గొన్నారు.

ఎటపాక: ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభ నేని చందు, తెలుగు యువత నేత నలజాల శ్రీకాంత్ చౌదరి, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తోటపల్లి, నెల్లిపాక, ఎటపాక, లక్ష్మీపురం, గుండాల, తదితర గ్రామాల్లో లబ్దిదారులకు మంజూరైన పింఛన్లను స్థానిక టీడీపీ నేతలు అందజేశారు. టీడీపీ సీనియర్ నేతలు కిలారి వెంకటేశ్వరరావు,పాటి చలపతి, పూరేటి వెం కటేశ్వరరావు, బాచినేని మల్లేశ్వరరావు, ఐటీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బాచినేని శ్రీకాంత్, ఏలూరి వెంకన్న, కణితిమధు, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట, ఇందుకూరు 1, తదితర గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన 72 వితంతు పింఛన్లను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, గేదెల పెదసుబ్బారావు, సిద్ద సత్యనారాయణ, లంక హరిశ్చంద్రుడు, రాజమండ్రి మనమ్మ , తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్ష పదవికి ఎన్నిక


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్ష పదవికి శుక్రవారం ఎన్నిక జరి గింది. స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలో జరిగిన సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరగ్గా, టీడీపీ నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావు పార్టీ ప్రెసిడెంట్‌గా ఉంటామని ఎన్నికలో నిలబడడంతో, ఎన్నికలు జరపాల్సి వచ్చింది. సీక్రెట్ ఓటింగ్ ద్వారా ఎన్నిక నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి ఎన్నికల ఫలితాలు తెలుపుతామని అబ్జర్వర్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సమావేశానికి ముందు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషదేవి పాలొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మఠం విజయభాస్కర్ ,దంతులూరి శివరామచంద్రరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

బూరుగుబందలో డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్

రంపచోడవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బూరుగుబంద, తాటివాడలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఏడు మండలాల్లో వివిధ రకాలైన పింఛన్లు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి అందజేయడం జరుగుతోందన్నారు. అనంతరం బూరుగుబంద గ్రామంలో డ్రోన్ల ద్వారా మలేరియా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, ఏఎంవో శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: డ్రోన్‌తో చింతూరులో శుక్రవారం యాంటీ లార్వా స్ప్రేయింగ్ ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. చింతూరులోని మురికి గుంతలో చేపట్టిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్, డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీవో, ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగరాజుకు పారిశుధ్య చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. గ్రామ పంచాయతీ, వైద్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు పని చేయాలన్నారు. వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై ప్రచారం

చింతూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల తొమ్మిదిన నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా ఆదివాసీ సంక్షేమ పరిషత్, గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీలు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఏడుగురాళ్లపల్లి, ముకునూరు, ఎర్రంపేట, మదుగూరు, మల్లెతోట, లక్కవరం, తదితర గ్రామాల్లో విడివిడిగా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, గిరిజన సంఘం నాయకుడు సీసం సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చింతూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత చింతా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో పాల్గొనండి


స్వప్నకుమారికి తులసి మొక్కను అందిస్తున్న కూటమి శ్రేణులు

వై.రామవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళలకు లక్కీ డ్రా ద్వారా బంగారు లక్ష్మీరూపులు ఇవ్వనున్నట్టు మండల బీజేపీ అధ్యక్షుడు కడబాల ఆదివిష్ణు తెలిపారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు సంకల్పంతో బంగారు లక్ష్మీ కానుకలు పేరుతో ఈనెల 4న అడ్డతీగలలో లక్కీ డ్రా తీసి మహిళలకు రూపులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం శుక్రవారం ఉచిత రిజిస్ట్రేషన్లు నమోదు చేశారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు గుడ్ల త్రిమూర్తులు, మడకం రామలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమమణి, నీలిమ, తదితరులు ఉన్నారు.


జడ్.రాగంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ


ప్రత్తిపాడులో పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


కోటనందూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న గాడి రాజుబాబు

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, ప్రతీనెలా 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తున్నామన్నారు. మండలంలోని జడ్.రాగంపేటలో ఎల్‌వన్ డిస్క్ సమస్యతో మంచానికే పరిమితమైన దివ్యాంగురాలు కొమ్మలపల్లి నాగవల్లి ఇంటికి వెళ్లి రూ.15వేలు పింఛన్ సొమ్మును శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కందుల చిట్టిబాబు, రాగంపేట సొసైటీ చైర్మన్ కందుల కొండయ్యచౌదరి, పాలచర్ల నాగేంద్రచౌదరి, కంటే సురేంద్ర, ఉండవల్లి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు. ఎంపీడీవో కె.చంద్రరావు మల్లేపల్లి, తాళ్లూరు, ఉప్పలపాడు, జెడ్.రాగంపేట గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ 8429మందికి గాను 7521మందికి పింఛన్ అందజేసి 90శాతం పూర్తి చేసినట్టు తెలిపారు.

ఏలేశ్వరం: పట్టణంలోని పలు వార్డుల్లో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వికలాంగులు, వితంతువులు, లబ్ధిదారులకు శుక్రవారం కౌన్సిలర్ కోనాల వెంకటరమణ అందజేశారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, పెండ్ర శ్రీను, టీడీపీ నాయకులు జొన్నాడ వీరబాబు, కందుల నాగు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల ను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు: మండలంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ 93శాతం పూర్తి చేశారు. 11,3539 పింఛన్లు ఉండగా 10800 వరకు పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన 182 పింఛన్లను ప్రత్తిపాడులో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, ధర్మవరంలో బొల్లు కొండబాబు, చినశంకర్లపూడిలో మిరియాల శ్రీను పంపిణీ చేశారు. ప్రత్తిపాడులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలుగుల నాని, మదినే దొరబాబు, జక్కారాజేంద్రకుమార్, పత్రి రమణ, ముత్యాల రాంబాబు, వీరబాబు, చిన్ని పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని వితంతు మహిళలకు కొత్త పింఛన్లను లోవ దేవస్థానం మాజీ చైర్మెన్ గాడి రాజుబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కరసత్యనారాయణ, డి.చిరంజీవిరాజు, సొసైటీ అధ్యక్షుడు పెనుముచ్చు నాగేశ్వరరావు, వెలగా వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని వింతతు పింఛన్లు 150 మందికి మంజూరైనట్టు కూటమి నేతలు తెలిపారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. రౌతులపూడిలో ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, రాజవరంలో టీడీపీ మండలాధ్యక్షురాలు లాలం కృష్ణ వేణి, చింతకాయల రాజుబాబు, మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యరానాయణ, ఎంపీటీసీ యామల సురేష్ అందజేశారు.

శంఖవరం: శంఖవరంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అందించారు. నూతనంగా 113 పింఛన్లు అందించినట్లు ఎంపీడీవో లక్ష్మారెడ్డి తెలిపారు. ఉపసర్పంచ్ చింతంనీడి కుమార్, బుర్రా వాసు, రౌతు శ్రీనివాస్, కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

జగ్గంపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను శనివారం ఉదయం 11గంటలకు పట్టణంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అందజేయనున్నారు. నియోజకవర్గస్థాయి అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో శనివారం నూతన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు, ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేస్తారని ఎంపీడీవో హరికృష్ణ తెలిపారు.

తునిరూరల్: ఎన్.సురవరం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి నాగసోమరాజు పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తొండంగి: బెండపూడిలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సాధనాల నూకరాజు. పాలచర్ల యర్రబ్బు, జనసేన నాయుడు తదితరులు పాల్గొన్నారు. మండలంలో మొత్తం 12430 పింఛన్లు ఉండగా మొదటి రోజు 80 శాతంవరకూ పంపిణీ పూర్తయ్యింది.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం


తల్లిపాలు ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీవో పూర్ణిమ

జగ్గంపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని సీడీపీవో ఎం.పూర్ణిమ పేర్కొన్నారు. మన్యంవారిపాలెం గ్రామంలో శుక్రవారం తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. ముర్రుపాలు రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ఈనెల 7 వరకు జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండల అంగన్వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్లు అమ్మాజీ, సునీత, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యదాయకమని ప్రత్తిపాడు కమ్యూనిటీహెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య చెప్పారు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ శుక్రవారం ఆసుపత్రి వద్ద నుంచి ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ర్యాలీని సూపరింటెండెంట్ సౌమ్య ప్రారంభించారు. తల్లిపాల ఆవశ్యకత పోస్టర్ ఆవిష్కరించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


డి.పోలవరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

శంఖవరం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆర్యోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కత్తిపూడి అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యా లీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియజేయడానికి ప్రతీఏడాది ఆగస్టు 1 నుంచి 7వరకూ అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజనీ, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

తుని రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని తుని ఏరియా సీడీపీవో కె.శ్రీలత అన్నారు. డి.పోలవరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు సంపూర్ణమైన ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను వివరించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఉన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక


విజయకుమార్, లోవ కుమార్, పాముల మూర్తి

జగ్గంపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు కాట్రవులపల్లి గ్రామానికి చెందిన కొల్లి విజయకుమార్, జె.కొత్తూరు గ్రామానికి చెందిన చెందిన పాముల మూర్తి, పిల్ల లోవ కుమార్ ఎంపికయ్యారు. కొల్లి విజయకుమార్ తండ్రి సత్తిబాబు నిరుపేద రైతు. మొదటి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు విజయకుమార్ అభినందించారు. లోవకుమార్ తండ్రి దాసు నిరు పేద కూలి. లోవ కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు. పాముల మూర్తి తండ్రి శ్రీను పాడి రైతు. కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఆవులమంద గ్రామానికి చెందిన వై.శ్రీనుబాబు (సివిల్), వై.రాజు (ఏపీఎస్పీ), వాకదారిపేటకు చెందిన బి.శ్రీను, శృంగవృక్షంపేటకు చెందిన ఎ.లోవరాజు, ముసలయ్యపేటకు చెందిన మణికంఠ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. పైడికొండ గ్రామానికి చెందిన జి.శివ, పి.పవన్, టి.శివ ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఎంపికైనవారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.


వెంకటలక్ష్మి, పిల్లి అనుషా

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్(సివిల్) కొలువులకు రౌతులపూడికి చెందిన కోరుప్రోలు వెంకటలక్ష్మి, పిల్లి అనుషా ఎంపికయ్యారు. వెంకటలక్ష్మి 117మార్కులతో ఎంపిక కాగా తల్లిదండ్రులు అప్పలనాయుడు, నాగమణి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పిల్లి అనుషా 127మార్కులు సాధించగా తండ్రి వీరబాబు చిన్నపాటి పనులు చేస్తుండగా తల్లి గృహిణిగా ఉంది.

పుస్తకాల అందజేత

కోటనందూరు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు లోవ దేవస్థానం మాజీ చైర్మెన్ గొర్లి అచ్చియ్యనాయుడు, టీడీపీ సీనియర్ నేత మాతిరెడ్డి భాస్కరరావు సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. మాజీసర్పంచ్ యర్ర చినసత్యనారాయణ, మాతిరెడ్డి బాబులు, ఎంఈవో అడిగర్ల శ్రీనివాస్, సీఆర్పీ యర్రశేఖర్, బీమిరెడ్డి తాతబ్బాయి, గుడివాడ నాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ

కోటనందూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు అన్నారు. శుక్రవారం కోటనందూరులోని సాయిజూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించారు. సైబర్‌నేరాలు, రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ టిరామకృష్ణ, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'9న ఆదివాసీ జెండా ఎగరాలి'

శంఖవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల9న గిరిజన ఉత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలో ఆదివాసీ జెండా ఎగరాలని యువజన సంఘం అధ్యక్షుడు లోత రామారావు కోరారు. శుక్రవారం పెదమల్లాపురంలో పలు గిరిజన సంఘాల నేతలు సమావేశమయ్యారు, గిరిజనసంస్కృతి, సంప్రదాయాలుప్రతిబింబించే విధంగా పండుగ నిర్వహించాలని తెలిపారు. పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. యువజన సంఘం కార్యదర్శి అశోక్, రాజశేఖర్ తదితరులున్నారు.

కష్టపడి పనిచేసే వారికి టీడీపీలో సముచిత స్థానం


టీడీపీలో చేరిన వారితో యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు, సముచిత స్థానం ఉంటుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరిన వారికి పార్టీ కండువా కప్పి యనమల ఆహ్వానించారు. వి.కొత్తూరుకి చెందిన తమరాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తమరాన వరలక్ష్మి ఆధ్వర్యంలో కోళ్ల ఫారం సెంటర్ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. యనమల వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటి నుంచి పని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు.

రూ.2.80లక్షలతో నూతన షెల్టర్లు


గెద్దనాపల్లిలో రెగ్యులేటర్ పనులు పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్

కిర్లంపూడి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గెద్దనాపల్లిలో బెడ్‌రెగ్యులేటర్ వద్ద రూ.2.80లక్షలతో నూతనంగా నాలుగు షెల్టర్లు నిర్మించినట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇటీవల వరదలు వచ్చి బెడ్‌రెగ్యులేటర్ వద్ద షెల్టర్లు కొట్టుకుపోవడంతో సింహాద్రిరాజుకాలువకు నీరు కిందకు పోతుంది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి ఈవిషయాన్ని తీసుకువెళ్లడంతో ఏలేరు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. సామర్లకోట డీఈఈ రవికుమార్, కిర్లంపూడి ఇరిగేషన్ ఏఈ వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు. దీని ద్వారా గెద్దనాపల్లి, కిర్లంపూడి మీదుగా రాయవరం, వెల్దుర్తి, దొంతమూరులో 5వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఐజి సత్తిబాబు, సిబ్బంది ఉన్నారు.

వర్గీకరణ సంతృప్తి స్థాయిలో జరగలేదు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివమణి


ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తునిరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏపీలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు వర్గీకరణ ద్వారా వచ్చిన రిజర్వేషన్ వాటా సంతృప్తి స్థాయిలో లేదని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలివెల శివమణి అన్నారు. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో రిజర్వేషన్లలో లోటు కనిపిస్తుందన్నారు. లోవ కొత్తూరులో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వివిధఅంశాలపై ప్రతినిధులు చర్చించారు. ఏపీలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలుండే వరకు గళం వినిపిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముద్రగడ తనయుడు కృతజ్ఞతలు

ప్రత్తిపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తమ తండ్రి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంగా క్షేమంగా ఉండాలని పూజలు, ప్రార్థనలు చేస్తున్న ప్రతి ఒక్కరికి ముద్రగడ పెద్ద కుమారుడు వీరరాఘవరావు(బాలు) కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మీ అందరికి మా కుటుంబం ఎప్పటికీ రుణ పడి ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌లో వైద్యులు సూచనల మేరకు తమ తండ్రి ఆరోగ్యం మరింత మెరుగుపడటానికి హైదరాబాద్‌లో ఉన్నారని బాలు చెప్పారు.

రోటరాక్ట్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

తునిరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పెసెస్ డిగ్రీ కళాశాలలో రోటరాక్టు క్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్ అండ్‌సబల డిస్ట్రిక్ట్ 3020నూతన కార్యవర్గం పదవీ స్వీకరణ శుక్రవారం జరిగింది. రోటరాక్టర్ చంద్రవర్ధన్, అనురాధ అధ్యక్షులుగా నియమితులయ్యారు. అతిథులుగా రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ వై.కల్యాణ్‌చక్రవర్తి, డిస్ట్రిక్ట్ కమిటీ కో చైర్మన్ నాగసురేష్, డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ రిప్రెజెంటేటివ్ కృష్ణ కేదారశెట్టి హాజరయ్యారు.

శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

ఏలేశ్వరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఏలేశ్వరంలో ని ఆర్టీసీ కాంప్లెక్స్, తోట వీధి, సువ్వయ్యమ్మపేట లలో దుర్గాదేవి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో పారాయణం కార్యక్రమం చేపట్టారు. అలమండ దుర్గాప్రసాద్, కటకం కిరీటి, తూరౌతు గురవయ్య, ఉడతల రమణారావు, ఇందిర, గుమ్మల గిరిజ, దేవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిగా అభయదుర్గ



కిర్లంపూడి: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా జగపతినగరం అభయదుర్గాలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏనుగువీధి సెంటర్‌లో ఏనుగువీధి రామాలయ కమి టీ పెద్దలు ఆధ్వర్యంలో అభయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని విశేష పూజలు చేశారు.

ఆదిత్య ఫోరెన్సిక్ మ్యాగజైన్ ఫోరెన్సిక్స్ 7వ సంచిక విడుదల


ఫోరెన్సిక్ మ్యాగజైన్ విడుదల చేస్తున్న ఏఎస్పీ దేవరాజ్‌పాటిల్

గండేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ ఫోరెన్సిక్ కళాశాల ద్వైమాసిక ఫోరెన్సిక్ సైన్స్ మ్యాగజైన్ అయిన ఫోరెన్సిక్స్ 7వ సంచికను కాకినాడలో అసిస్టెంట్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ కాకినాడ డివిజన్‌గా పనిచేస్తున్న దేవరాజ్ పాటిల్ చేతుల మీదుగా విడుదల చేశారని ఫోరెన్సిక్ కళాశాల ప్రిన్సిపాల్, మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ విలాస్ అనిల్ చవాన్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ తుషార్ కేసీ ఉన్నారు.

గెస్ట్ లెక్చర్

ఆదిత్య యూనివర్సిటీలో మైక్రో ఎలక్ట్రానిక్స్ ఫాబ్రికేషన్ టెక్నాలజీపై గెస్ట్ లెక్చర్ ప్రోగ్రాం ముగిసిందని యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ వై.ప్రభతి ప్రభాకర్‌రావు విద్యార్థులు, అధ్యాపకులకు సీఎంఏఎస్ ఫాబ్రికేషన్ టెక్నాలజీపై సమగ్ర అవగాహన, దాని ప్రాసెస్ స్టెప్స్, వాస్తవ అనువర్తనాలు వివరించారు.

డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తునిరూరల్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. కంప్యూటర్ సైన్స్, బోటనీ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు ఆగస్టు 4వతేదీ లోపు ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

కోటనందూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం అల్లిపూడిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులు వ్యవసాయం పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. ఏఈవో జగ్గప్పరావు, సురేష్ పాల్గొన్నారు.

11న మహా ధర్నా

ప్రత్తిపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఈనెల 11న రాజధాని అమరావతిలో ఇంటర్ బోర్డు కమిషనరేట్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్టు రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం చెప్పారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం రెగ్యులరేషన్ ప్రక్రియను పునఃప్రారంభిస్తుందని ఆశించామని, సంవత్సరం దాటినా తమ సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.